ఆపరేషన్ కగార్ పెద్ద బూటకం

సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంత మొందించాలని ఉద్దేశంతో ఆపరేషన్ కగార్ పేరుతో పెద్ద నాటకం ఆడుతుందని ఈ విషయాన్ని దేశం మొత్తం ప్రజలు గమనిస్తున్నారని జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తుల జేబుల్లో కేంద్ర ప్రభుత్వం పెట్టిందని, వారి అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీకి కావాలని పేద ప్రజలు అభివృద్ధి చెందడం ఆయనకు ఇష్టం లేదని అన్నారు. అమాయకులైన గిరిజనులను మావోయిజం పేరుతో అంతమొందించడం వందేళ్ల చరిత్రలో ఇదే ప్రథమమని అన్నారు. పౌర హక్కుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో మావోయిస్టులతో శాంతియుతంగా చర్చలు జరిపి జనజీవన స్రవంతిలోకి వారిని తీసుకోవాలని కోరారు. మావోయిస్టులే లేకపోతే దేశం లేదని అన్నారు. టీడీపీ అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా పచ్చ పార్టీ నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పేరుతో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలను మరోసారి మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బేబి నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్ము నాయుడు, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం గతవారం అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన), మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్ష్ము నాయుడు, ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజులు పల్లాను పరామర్శించారు.

తల్లికి వందనంలో ఆంక్షలు తగదు

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: తల్లికి వందనం పథకంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో 15 వేలు రూపాయలు వేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేశారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం సీపీఐ జిల్లా కార్యాలయం డి.ఎస్.ఆర్ అమర్ భవన్‌లో బుగత అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబు నాయుడు ఎలాంటి తారతమ్య భేదాలు చూపకుండా, ఆంక్షలు పెట్టకుండా తమ పిల్లల చదువులకి ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని ఏడాది కాలంగా ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్న తల్లులను మోసం చేసి వారి ఆశల్లో నీళ్ళు పోసి దగా చేశారని విమర్శించారు. తల్లి వందనం పథకం కొంతమందికి మాత్రమే చెల్లించి మిగతా వాళ్ళు అర్హులైన కూడా వాళ్ళకి కరెంట్ బిల్లులు ఎక్కువ వచ్చాయని, వార్షిక ఆదాయం ఎక్కువ ఉందని అనేక అభ్యంతరాలు చూపిస్తూ అనర్హులుగా చూపించడం చాల దుర్మార్గం అని మండిపడ్డారు. విద్యుత్తు చార్జీలు విపరీతంగా పెంచి ఆ భారం పెరిగిన ప్రజలు ఇబ్బందులు పడుతుంటే విద్యుత్తు వాడకం ఎక్కువ ఉందని కుంటి షాకులు చూపించి ప్రజలకు సంక్షేమ పథకాలకు దురం చేస్తారా అని ప్రశ్నించారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకి, ఉద్యుగులకి పేరుకే ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు తీసుకుంటున్నా నేడు పెరుగుతున్న ఆర్థిక భారాలు వలన వచ్చే 10 వేలు 15 వేలు జీతాలు సరిపోక ఇబ్బందులు పడుతుంటే వాళ్ళని లక్షల్లో జీతాలు తీసుకుంటున్నట్టుగా చూపిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులను చేస్తున్నారని అని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా తల్లుల అందరి ఖాతాల్లో జమ చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుని కూటమి పాలకులు మంచి ప్రభుత్వం అని ఇంటింటికి స్టిక్కర్లు అంటించుకోవడం కాకుండా ప్రజలంతా చెప్పుకునేలా మీ పాలనలో చిత్తశుద్ధి చూపించుకోవాలని తెలిపారు.

రక్తదానం ప్రతి మనిషి జీవితంలో ఒక సువర్ణ అవకాశం

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: ప్రతిమనిషి జీవితంలో బ్రతికి ఉన్నప్పుడు దొరికే గొప్ప సదవకాశం ఇతరులు ఆపదలో ఉన్నప్పుడు చేసే రక్తదానమేనని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎన్.వి.ఎన్. బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో తాడేపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రక్తదాతల సత్కార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రక్తదాన చైతన్య కార్యక్రమాలు పెరగటం వెనుక తాడేపల్లి నాగేశ్వరరావు, ఇప్పలవలస గోపాలరావు కృషి చాలా ఉందని, ప్రజలు మరింత చైతన్యవంతం కావడానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అయ్యగారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు తల్లికి వందనం పేరుతో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆర్థిక సహకారం అందించినందుకు చీపురుపల్లి పట్టణంలోని కొత్త దేవుడు వీధిలో విద్యార్థుల తల్లిదండ్రులు చంద్రబాబు చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక నాయుడు సూచనలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతూ తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గవిడి నాగరాజు, గవిడి భారతి, సేనపతి కనకరాజు, శ్రీనివాసరావు, రాము నాయుడు, కోలా రాము, గవిడి సాయి, చిలుకూరు శేఖర్, గవిడి జయ, గవిడి రూపవతి పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీని రెల్లిలోనే ఏర్పాటు చేయాలి

జనసేన క్రియాశీల సభ్యులు శ్రీనివాసరాజు

విశాలాంధ్ర - కొత్తవలస: నాటి రాష్ట్ర విభజన చట్ట హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ (కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం)ని కొత్తవలస మండలం, రెల్లి రెవిన్యూ పరిధి అప్పన్నదొరపాలెం పంచాయతీలోనే ఏర్పాటుచేయాలని లక్కవరపుకోట మండలం భీమాలి గ్రామానికి చెందిన జనసేన క్రియాశీల సభ్యులు కమ్మెళ్ళ వెంకట సత్యనారాయణ రాజు (శ్రీనివాసరాజు) డిమాండ్ చేశారు. కొత్తవలస మండల కేంద్రంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం ఇక్కడ గిరిజన వర్సిటీ నిర్మాణం కొరకు నమ్మబలికి గిరిజనుల సాగులో ఉన్న సుమారు 526 ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కేవలం శంకుస్థాపనతో ముగించారని, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం ఇక్కడ నుంచీ వర్సిటిని మరోచోటకు తరలించినా... మళ్ళీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ పెద్దలు చంద్రబాబు, లోకేష్‌లు రెల్లిలోనే గిరిజన వర్సిటీని ఏర్పాటుచేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి ఇప్పుడు పోలీస్ గ్రేహౌండ్స్ ఏర్పాటుకు గానూ ఆ 526 ఎకరాల భూములను ప్రభుత్వం కేటాయించడం సమంజసం కాదన్నారు. రెల్లిలోనే గిరిజన వర్సిటిని ఏర్పాటుచేయాలని శ్రీనివాసరాజు కోరారు. ఈ మేరకు కొత్తవలస జంక్షన్లో ప్రజల్ని చైతన్య పరుస్తూ బేనర్లు, కరపత్రాలను పంపిణీ చేసారు.

పుణ్య తిరుమల గిరిలో సుప్రభాత సేవ

విశాలాంధ్ర - ఎస్.కోట రూరల్: పుణ్యగిరిలోని పుణ్య తిరుమల గిరి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ పద్మావతి గోదా దేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ రఘురాజు, సుధారాణి దంపతులు, మోపడ గౌరినాయుడు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు ప్రత్యేకంగా హాజరై ఆలయ వైభవాన్ని చూసి ఆనందించారు. భక్తుల సమక్షంలో నిత్య పూజలు, వారపు కార్యక్రమాలు సక్రమంగా జరగడానికి కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు, భక్తులు, ప్రాంత ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలి

విశాలాంధ్ర - భోగాపురం: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ లను ఎత్తివేయాలని సిఐటియు జిల్లా నాయకులు టీవీ రమణ అన్నారు. ఈనెల 9వ తేదీన జరగబోయే దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించి సదస్సును భోగాపురంలో శనివారం నిర్వహించారు. ఈ లేబర్ కోడ్‌లు ద్వారా పెట్టుబడిదారులకు లాభం చేకూర్చడమే తప్ప ఇంకో ఉపయోగం లేదని అన్నారు. దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సిఐటి వినాయకుడు సూర్యనారాయణ, అంగన్వాడి యూనియన్ లీడర్ అనిత, పెద్ది లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - వంగర: గ్రామ సచివాలయాల్లో యోగాంధ్రా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపిడిఓ రఘునాదాచారి వివరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 146వ రోజు యోగ డిమానిస్ట్రేషన్ నిర్వహించినట్లు వెల్లడించారు. మండలం మొత్తం 2500 మంది వరకు పాల్గొన్నట్లు వెల్లడించారు. మండలంలో 17156 మందిని ఇంతవరకూ రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిరికి జ్యోతి, సచివాలయ సిబ్బంది యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజు ఇంటిని ముట్టడించిన జిందాల్ నిర్వాసితులు

- అండగా నిలిచి న్యాయం చేయాలని వినతి
- న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్సీ హామీతో నిరసన విరమణ

విశాలాంధ్ర -విజయనగరం: ఎస్.కోట మండలంలోని బొడ్డవరలో ఉంటున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాసాన్ని శనివారం ఉదయం జిందాల్ నిర్వాసిత రైతులు ఒక్కసారిగా ముట్టడించారు. జిందాల్ కంపెనీ యాజమాన్యం తమకు అన్యాయం చేసిందని, మాకు అండగా ఉండి మమ్మల్ని నడిపించి పూర్తిస్థాయిలో న్యాయం చేసేలా ఎమ్మెల్సీ చూడాలని నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాసితులు మాట్లాడుతూ ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో ఇక్కడ జిందాల్ పరిశ్రమ ఏర్పాటుతో మీ బ్రతుకులు బంగారంలా ఉంటాయని ఆనాడు మీరు ఇచ్చిన హామీతో ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా వందల ఎకరాల భూమిని ఇచ్చేశామని అయితే నేటికీ 18 సంవత్సరాలు గడుస్తున్న ఇక్కడ ఎటువంటి పరిశ్రమ రాకపోగా భూ యజమానులమైన మేము బొమ్మలు కోల్పోయి రైతు కూలీలుగా మిగిలామని వాపోయారు. జిందాల్ సంస్థ తమకు న్యాయవరంగా ఇస్తామన్న షేర్లు ఇతర సౌకర్యాలు ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. గత ప్రభుత్వంలో తమతో మాట మాత్రం చెప్పకుండా ఈ పరిశ్రమ భూముల్లో ఎమ్మెస్ ఎం ఈ పార్కులు పెడతామని నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటిస్తే వెంటనే మీ ఆధ్వర్యంలో రైతులు అంతా జిందాల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం రోజున తరబడి చేశామని గుర్తు చేసారు. అప్పటి ప్రభుత్వం స్పందించి మీకు న్యాయం చేశాక ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి హామీ ఇవ్వడం జరిగిందని ఆనాటి మీ కృషితో మాకు నమ్మకం కలిగిందని అన్నారు.. అయితే కొద్ది రోజులుగా జిందాల్ భూములలో చదును పనులు జరుగుతున్నాయని, ఇక్కడ పరిశ్రమలు వస్తున్నాయని ప్రచారం జరుగుతుందని అయితే తమతో మాట మాత్రం చెప్పకుండా ఇక్కడ పరిశ్రమలు ఎలా పెడతారని ప్రశ్నించారు. భూములు ఇచ్చిన రైతులకు నిర్వాసితులకు సమాచారం ఇచ్చి వారి అభిప్రాయాలు తర్వాత ఇక్కడ పార్కులు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. తమకు జిందాల్ యాజమాన్యం ఇచ్చిన పూర్తి హామీలు చేశాక ప్రభుత్వం ఎక్కడ ఎం ఎస్ ఎం ఈ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో తమ మాట మన్నించి అప్పటి ముఖ్యమంత్రి శంకుస్థాపన కార్యక్రమాలు ఆపారని ఈ ప్రభుత్వం కూడా రైతుల పక్షం వహించి జిందాల్ యాజమాన్యం తమకు పూర్తి న్యాయం చేసే వరకు ఈ కార్యక్రమం ఆపాలని తాము దేనికి వ్యతిరేకం కాదని అయితే ఈ పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులమని తమకు ఏళ్ల తరబడి అన్యాయం జరుగుతున్న ఈనాటి వరకు న్యాయం జరగలేదని వాపోయారు. వీటిపై ఎమ్మెల్సీ రఘురాజు తమ తరపున నిలబడాలని తమకు న్యాయం కోసం అవసరమైతే ప్రధానమంత్రిని కూడా కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని గట్టిగా పేర్కొన్నారు. ఇదే విషయంపై ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో జిందాల్ నిర్వాసితుల స్థితిని ఎమ్మెల్యే లలిత కుమారి, ఎంపీ శ్రీ భరత్ ,మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు వివరించామని తెలిపారు. మరోసారి జిందాల్ రైతుల న్యాయపరమైన కోర్కెలను వారి సమస్యలను వివరిస్తానని కొద్ది రోజులు వేచి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందుగా తాటిపూడి ఆయకట్టు రైతులు ఎమ్మెల్సీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికీ తాటిపూడి నీరును విశాఖపట్నం విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగిస్తున్నారని, తమ ఆయుకట్టుకు నీరు పూర్తిగా రావడంలేదని తెలిపారు. ఇప్పుడు జిందాల్ పరిశ్రమలు కూడా నీరు ఇస్తే ఇక వ్యవసాయాన్ని తాము వదులుకోవాల్సిందే అని ఆందోళన చెందారు. ఈ విషయాన్ని తాను ప్రజాప్రతినిధుల దృష్టిలో పెట్టి మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా శ్రీనివాసుని ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర- గజపతినగరం: మండలంలోని దావాలాపేటలో ఉన్న కేతల నగర్‌లో వెలసిన శ్రీనివాసుని ఆలయ వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా కేతల ఆంజనేయ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి భక్తులు, ప్రజలు వివిధ గ్రామాలకు చెందిన వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి గజపతినగరానికి చెందిన చిన్నయ్య స్వామి నిర్వహించారు.

ఉద్యానవన పంటలపై రాయితీని రైతులకు తెలియజేయాలి

విశాలాంధ్ర - భోగాపురం: ఉద్యానవన పంటలపై ప్రభుత్వ ఇస్తున్న రాయితీని రైతులకు తెలియజేయాలని ఉద్యానవన శాఖాధికారిని ఉమా భరణి అన్నారు. మండలంలోని సవరవల్లి రైతు భరోసా కేంద్రంలో ఉద్యానవన సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతం కంటే ఈసారి ఉద్యానవన పంటలపై ప్రభుత్వం అధిక రైతు ప్రకటించిందని అన్నారు. మామిడి, జీడి, బొప్పాయి వంటి తదితర పంటలు వేసుకుంటే మంచిదని రైతులకు సూచించాలని తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఈ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. అప్పుడే వారు ఈ పంటలు వేసుకునేందుకు ముందుకు వస్తారని తెలిపారు.

సాంబశివరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో సీనియర్ టీడీపీ నాయకులు కెల్ల గ్రామానికి చెందిన కే.సాంబశివరాజు 10 రోజుల క్రితం మృతి చెందిన సంగతి తెలిసిందే. వారి కుటుంబాన్ని శనివారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు గ్రామంలోకి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ కోసం ఎన్నో సేవలు చేసిన సాంబశివరాజు లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. పార్టీ కోసం గ్రామస్థాయిలో పనిచేయడం చాలా కష్టతరం అన్నారు. అలాంటి వ్యక్తుల్లో సాంబరాజు ఒకరని కొనియాడారు. జిల్లాస్థాయిలో మహిళా విభాగంలో విమల రాణి సేవలను కొనియాడారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కే.గోవిందు గ్రామ టీడీపీ నాయకులు, మండల నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు వెలుగినివ్వాలి

డీఈవో మాణిక్యం నాయుడు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదా యకంగా నిలిచి, చీకట్లో వెలుగునిచ్చే టార్చ్‌లైట్ వలే విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం గురజాడ పాఠశాలలో ఉత్తరాంధ్ర జిల్లాల జెవివి సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్దగలిగే శక్తి ఉపాధ్యాయులకే ఉందని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ పిల్లల పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటారో, అదే శ్రద్ధ విద్యార్థుల పట్ల చూపించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరు తన మూలాలను మర్చిపోకూడదని, గతంలో మనం ఏ విధంగా విద్య నేర్చుకున్నాం, ఏ విధంగాబతికామో గుర్తుపెట్టుకుని నడుచుకుంటే ఉత్తమ విద్యార్థులను తయారు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, జనవిజ్ఞాన వేదిక జాతీయ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి, విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిరియాల కృష్ణారావు, జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, సమతా విభాగం అధ్యక్షురాలు యు.శాంతి కుమారి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం

విశాలాంధ్ర - రాజాం: రాజాంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్త దాతలకు సత్కారం చేశారు. రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం శాఖ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్ తెలిపారు. రక్త గ్రూపులను కనుగొన్న కార్ల్ ల్యాండ్ స్టీనర్ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 45 సార్లు రక్తదానం చేసిన ప్రభుత్వ ఐటిఐ అధ్యాపకులు మండల చైతన్య కుమార్, రాజాం చిరంజీవి ఫాన్స్ ప్రతినిధులు వావిలపల్లి చంద్రశేఖర్, కర్ణేన జనార్దన్, 15సార్లు రక్తదానం చేసిన మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణను మెమోంటో శాలువా షీల్డ్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా సెక్రటరీ ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, జూనియర్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ అదపాక దామోదరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు జీబ్రా గీతల ఏర్పాటు

విశాలాంధ్ర - విజయనగరం: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా నగరంలోని సంతకాల వద్ద జీబ్రా గీతలు వేయించే ఏర్పాట్లను నగరపాలక సంస్థ చేపడుతోంది. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజనీరింగ్ సిబ్బంది జీబ్రా గీతలు వేయించే ప్రక్రియలను పరిశీలిస్తున్నారు. సిగ్నల్ లైట్లు వేసే సమయంలో వాహన చోధకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుకు తగిన సూచికలను ఏర్పాటు చేసే విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు. ఇందుకోసం వాహన చోదకులు కూడా ట్రాఫిక్ నిబంధనలు, సూచికలను గమనిస్తూ సురక్షితమైన ప్రయాణాన్ని చేపట్టాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు.

జిల్లాలో యోగా మాక్ డ్రిల్ విజయవంతం

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లా వ్యాప్తంగా శనివారం యోగా మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 తేదీన ప్రధాని మోదీ విశాఖలో పాల్గొంటున్న యోగా కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిలో భాగంగా గతనెల 21 నుంచి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 21న రికార్డు స్థాయిలో జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి సన్నద్ధంలో భాగంగా, జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో సన్నాహక యోగా అభ్యాసాలు నిర్వహించారు. ఈ డెమో యోగ సాధన కార్యక్రమం వల్ల అంతర్జాతీయ యోగ దినోత్సవం కార్యక్రమములో లోటుపాట్లు ముందస్తుగా గుర్తించేందుకు దోహద పడుతుందని జాయింట్ కలెక్టర్ అన్నారు. 21న జరగబోయే యోగ కార్యక్రమంలో ప్రతీ సచివాలయం జియో పెన్సింగ్ ద్వారా ఎంతమంది యోగాభ్యాసకులు హాజరవుతున్న సమాచారం యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. ప్రధాన మంత్రి విశాఖలో హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లానుండి సుమారు ముప్పై వేలమంది యోగసాధకులను తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు జెసి ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో నమోదు అయిన 5652 కేంద్రాల్లో సుమారు 3 లక్షల మంది యోగ డెమోలో పాల్గొన్నట్లు చెప్పారు. ఇదే సాధన కొనసాగించి, 21న జరిగే మెగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెసి కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర - వేపాడ: పురుషులకు దీటుగా మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు. స్త్రీ శక్తి భవనంలో మండల పార్టీ అధ్యక్షుడు గోంప వెంకటరావు ఆధ్వర్యంలో మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణలో ఆమె మాట్లాడారు. శిక్షణ నేర్చుకున్న మహిళలు గ్రూపుగా ఏర్పడి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పిల్లలకు, మహిళలకు మోడల్ డ్రెస్సులు కుట్టి హోల్‌సేల్ షాపులకు దుస్తులను అందించడంతో ఆర్థికంగా బలోపేతమవచ్చున్నారు. అలాగే అలాంటి మహిళలకు బ్యాంకుల నుండి రుణాలు కూడా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ కృష్ణ కుమారి, ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ, జెడ్పీటీసీ శానాపతి అప్పారావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కొట్టాడ రమణమూర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సుంకరి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జొన్నవల్లి సత్తిబాబు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు గోకేడ మహేష్, టీడీపీ నాయకులు మంచిన అప్పలసూరి, భోజంకి మహేష్, నిరుజోగి అమ్మ తల్లి నాయుడు, కొటాన అప్పలనాయుడు, గోకాడ నాగభూషణం, రంది మహేశ్వరరావు, శానాపతి గణేష్, ఎర్రాప్రగడ సూర్యం, గోగాడ జగన్నాథం నాయుడు, బూసర్ల కృష్ణకుమార్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

విశాలాంధ్ర భోగాపురం: భోగాపురం తహశీల్దార్‌గా ఎం.రమణమ్మ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తాహసిల్దార్ ఎం సురేష్ కు మన్యం జిల్లా బదిలీ జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన తాహసిల్దార్ ను డిప్యూటీ తహసీల్దార్ హరి, ఆర్ ఐ ఇమ్రాన్, కార్యాలయ సిబ్బంది తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈనెల 9, 10,11 తేదీల్లో అనంతపూర్ జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు విజయ కేతనం ఎగరవేశారు సంబంధించి మూడవ స్థానం కైవసం చేసుకున్నారు .19 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్ ,8 బ్రాంజ్ మెడల్స్. పొందారు వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు , రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ సెక్రెటరీ సిహెచ్ వేణుగోపాలరావు కోచ్ యశస్విని గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు రానున్న కాలంలో ఎన్నో విజయాలు సాధించి జిల్లాతో పాటు మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో నిందితులపై లోతైన దర్యాప్తు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గంజాయి అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగంకు పాల్పడి, జిల్లాలో పట్టుబడిన కేసుల్లో, అరెస్టు కాబడిన నిందితులు సంపాదించిన అక్రమ ఆస్తులను సీజ్ చేసేందుకు చర్యలు చేపుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో ఈ తరహా కేసుల్లో మరింత లోతైన దర్యాప్తు చేపడుతూ, వారు సంపాదించిన స్థిర, చరాలస్తులు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నామని, బాధ్యులైన వ్యక్తులపై కఠిన చర్యలు గంజాయి అక్రమ వ్యాపారులను హెచ్చరించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, నిల్వలు, విక్రయాలు, వినియోగంకు పాల్పడే వ్యక్తులపై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసామన్నారు. ఈ కేసుల్లో పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడం కాకుండా, అందుకు బాధ్యులైన ప్రధాన నిందితులపై కూడా కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణ, వ్యాపారాలను నియంత్రించేందుకు వారు సంపాదించిన అక్రమ ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో నమోదైన గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన ప్రధాన నిందితుల బ్యాంకు ఖాతాలను, కొనుగోలు చేసిన వాహనాలు, భూములు, ఇండ్లను, ఇతర స్థిర, చరాస్తుల వివరాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఎస్.కోట పోలీసు స్టేషనులో నమోదైన రెండు గంజాయి కేసుల్లో ఇద్దరు నిందితుల నుండి సుమారు రూ.2.5 కోట్లు ఆస్తులను సీజ్ చేసామని తెలిపారు.గత రెండు సంవత్సరాల్లో జిల్లా పోలీసుశాఖ గంజాయి నియంత్రణకు విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ, గంజాయి అక్రమ రవాణకు కఠిన చర్యలు చేపట్టిందన్నారు. గంజాయి అక్రమ రవాణకు పాల్పడిన వారిపై 2024 సం.లో 83 కేసులు నమోదు చేసి, 268మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 30వాహనాలను, 2,157 కిలోల గంజాయి, 78 గ్రాముల నల్లమందు సీజ్ చేసామన్నారు. అదే విధంగా 2025 సం. లో ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసి,155 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 346 కిలోల గంజాయి, 21 వాహనాలను సీజ్ చేసామన్నారు. ప్రజలందరూ చట్టాలను గౌరవిస్తూ, మాదక ద్రవ్యా రవాణ, అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగానికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ తరహా వ్యాపారాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అక్రమ వ్యాపారులను తీవ్రంగా హెచ్చరించారు.

యోగాపై సంపూర్ణ చైతన్యం అవసరం

విశాలాంధ్ర - విజయనగరం: యోగా పట్ల ప్రజల్లో సంపూర్ణ చైతన్యం తీసుకురావడమే యోగాంధ్ర ముఖ్య ఉద్దేశమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు.యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం పాల్ నగర్ జంక్షన్ వద్ద యోగాసనాలు వేసే ప్రక్రియలు జరిగాయి. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి అందరిచే యోగాసనాలు వేయించారు. అంతకుముందు యోగాసనాల అవశ్యకతను వివరించారు. అనంతరం పెద్ద ఎత్తున హాజరైన వివిధ రంగాల ప్రజలతో ఆర్ అండ్ బి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతోందన్నారు. నెలరోజుల పాటు యోగ ప్రక్రియలను చేపట్టి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈరోజు పెద్ద సంఖ్యలో హాజరైన వారితో ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో అధిక శాతం మంది ప్రజలు పాల్గొని యోగ ప్రక్రియలు నిర్వహించే విధంగా ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలను రూపకల్పన చేసామన్నారు.తద్వారా ప్రతి ఒక్కరూ యోగ పట్ల ఆకర్షితులు కావాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. ఈ నెల 21వ తేదీన ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టనున్న బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఆయుష్ అధికారి ఆనందరావు మాట్లాడుతూ దైనందన జీవితంలో యోగ ఒక భాగం కావాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగ చక్కటి మార్గంగా పరిణమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వరరావు, టి పి ఆర్ ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డ్వాక్రా సంఘ మహిళలు, తైక్వాండో క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లులు ఖాతాల్లోకి తల్లికి వందనం జమ

ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర - వేపాడ: రాష్ట్రాన్ని సంక్షేమంతోపాటు విద్యాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం వినూత్న పథకాలను ప్రవేశ పెడుతోందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ నాడు ఎన్నికల్లో చెప్పిన విధంగా, సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా తల్లికి వందనం పథకానికి సంబంధించి ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు. అలాగే ఎవరికైనా సాంకేతిక లోపం వలన అర్హులై ఉండి తల్లికి వందనం పడని తల్లులు వారిసచివాలయంలో వెళ్లి ఆప్షన్ చేయించుకోవాలని సూచించారు. విద్యాశాఖలో పెను మార్పులు తీసుకువచ్చి పిల్లల విద్యాభివృద్ధి దిశగా అన్ని విధాల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, మహిళ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు, సుంకరి అప్పారావు, బిజెపి మండల అధ్యక్షుడు జి.మహేష్, టిడిపి నాయకులు దుల్ల వెంకటరమణ, గుంటపల్లి దేముడు నాయుడు, కోన సత్యనారాయణ, డెక్క దేముడు నాయుడు, జగన్నాధంనాయుడు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, చల్ల వెంకటరావు, నిరుజోగి బంగారు నాయుడు, గోకేడ భూషన్, కోటాన అర్జునరావు, శానాపతి గణేష్, జగన్, సూర్యం, మళ్ళ రమణ, ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మార్పు సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - బొబ్బిలి: ఉపాధ్యాయ ఉద్యమ ధ్రువతార, నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న ఎన్నో సౌకర్యాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు, మాజీ శాసనమండలి సభ్యులు కా. మార్పు బాలకృష్ణమ్మ జయంతి పక్షోత్సవాలలో భాగంగా పట్టణంలో ఒక ప్రైవేట్ పాఠశాలలో కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు. మండల శాఖ అధ్యక్షులు సీర సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) రాష్ట్ర, జిల్లా బాధ్యులతో పాటు, బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల బాధ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాడంగి మండల విద్యాశాఖాధికారి వి.లక్ష్మణదొర మాట్లాడుతూ ఉపాధ్యాయుడు బ్రతకలేని బడిపంతులు స్థాయి నుండి ఉన్నతంగా బ్రతికే గలిగే స్థాయికి రావడానికి ముఖ్య కారకులైన కా.మార్పు బాలకృష్ణమ్మ నిస్వార్థ సేవలు ఉపాధ్యాయ లోకం మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎం.బలరాం నాయుడు, రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయ్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయులు బొత్స సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి వెంకట నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు గంట సత్యనారాయణ, సిహెచ్ రామరావు, జిల్లా కార్యదర్శి కె.సత్యారావు, మండల ప్రధాన కార్యదర్శి డి.సుధాకర్‌రావు, తెర్లాం మండల అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు, సీనియర్ కార్యకర్తలు బొను విజయ భాస్కరరావు , ఎ.లక్ష్మణ, కె.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాగరంలో యోగాపై మహిళలకు అవగాహన

విశాలాంధ్ర-జామి: మండలంలోని జాగరం గ్రామంలో యోగాంధ్రకార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళలకు శనివారం యోగాపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈయోగా కార్యక్రమంలో ముందుగా యోగాపై మహిళలకు కలిగే లాభాలను వివరించారు.

స్థానిక టీడీపీ నేత రెడ్డి పైడిబాబు యోగా వివరాలను మహిళలకు తెలియజేసారు. ప్రతీ ఒక్కరు నేడు ఇనత్య ఈజవితంలో యోగాను అవలంబించాలని సూచించారు. అనేక రోగాలను దరి చేరకుండా యోగా కాపాడుతుందని తెలిపారు. అలాగే ఈనెల 21న విశాఖలో ప్రధాని నరేంద్రమోడీ యోగా కార్యక్రమానికి విచ్చేస్తున్నారని, గ్రామంనుంచి తప్పనిసరిగా వెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

17న అండర్ -16 క్రికెట్ జట్టు ఎంపికలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అండర్ -16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి. సీతారామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జి క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అలాగే పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డ్, జన్మ ధ్రువీకరణ పత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకు రావాలన్నారు. ఉదయం 7.30 గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్టుతో హాజరు కావాలని ఆయన కోరారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేపడితే చర్యలు

విశాలాంధ్ర - విజయనగరం: రహదారులు, ఫుట్‌ఫాత్‌లను ఆక్రమించి చిరు వ్యాపారాలను చేపట్టరాదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా ప్రధాన రహదారులు, జన సమ్మర్ధం ఉన్న ప్రాంతాలలో చిరు వ్యాపారాలు చేపట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతుందని అన్నారు. కమీషనర్ ఆదేశాల మేరకు శనివారం ప్రణాళిక సిబ్బంది గంటస్తంభం, కోడి రామ్మూర్తి వ్యాయామశాల, న్యూపూర్ణ జంక్షన్ వంటి ప్రాంతాలలో రహదారులను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేపడుతున్న వారిని అక్కడ నుండి తరలించి వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నిర్దేశిత ప్రాంతాలలో మాత్రమే చిరు వ్యాపారాలు చేపట్టాలని చెప్పారు. లేనియెడల ఉపేక్షించ బోమని స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం ఇందుకోసం ప్రత్యేక సిబ్బందితో క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతున్నామన్నారు.

సమాజానికి స్ఫూర్తి రక్తదాతలు

విశాలాంధ్ర - బొబ్బిలి : సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు రక్త దాతలేనని రోటరీ జిల్లా చైర్మన్ జె సి రాజు అన్నారు. రక్త దాతల దినోత్సవ సందర్భంగా బొబ్బిలి రోటరీ క్లబ్ సభ్యులుగా రోటరీ మరియు వివిధ రక్తదాన శిబిరాల్లో అత్యధిక సార్లు రక్తదానం చేసిన రొటేరియన్స్ ను సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సింద్రీ శ్రీనివాసన్ (43 సార్లు)శ్రీ హరి(38 సార్లు)శంకర రావు (42సార్లు) లను శనివారం రోటరీ కార్యాలయం లో రోటరీ జిల్లా చైర్మన్ జె సి రాజు, కార్యనిర్వహన కార్యదర్శి కె రామ కృష్ణ, సెక్రటరీ ఎలెక్ట్ శివ కాంత్ సర్వీస్ చైర్ కృష్ణ మోహన్ లు వారిని దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. సభ్యులు పాల్గొన్నారు రక్త దాతలే నిజ హీరోలని ,ప్రాణ దాతలని ,సమాజానికి స్ఫూర్తి అని జె సి రాజు అన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గం వీఆర్ఏల సమన్వయ కమిటీ సమావేశం జి.అప్పారావు అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యల పట్ల గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. వీఆర్ఏలకు గత ప్రభుత్వం కనీస వేతనాలు 26వేల రూపాయలు అమలు చేస్తామని, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని నామినీలను రెగ్యులర్ చేస్తామని ప్రమోషన్లు ఇస్తామని మండలాల్లో వీఆర్ఏ పోస్టులు ఖాళీలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం నేటి వరకు హామీలు అమలు చేయడం లేదని అన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకపోతే జూలై 9 నుంచి సమ్మె చేపడతామని తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కమిటీ కన్వీనర్‌గా జి.అప్పారావు, బొబ్బిలి జె.సూర్యారావు, తెరలాం ఆర్.అప్పారావు, బాడంగి కె.రాజారావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తెర్లాం సిఐటియు మండల నాయకులు సింగిరెడ్డి గోపాలు, మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షులు పి.లక్ష్మణరావు వీఆర్ఏలు పాల్గొన్నారు.

అవేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - బొబ్బిలి: జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అవేర్ ఫౌండేషన్ అధినేత పెద్దింటి మనోజ్ కుమార్ (బాబి) ఆధ్వర్యంలో శ్రీ వేణు గోపాల స్వామి టెంపుల్ సెంటర్, లాట్ మొబైల్, మేడపైన అవేర్ ఫౌండేషన్ ఆఫీస్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి యువత పాల్గొని 72 మంది రక్త దానం చేశారు. మనోజ్ మాట్లాడుతూ ఈ వేసవికాలంలో రక్త నిల్వలు తక్కువగా ఉండటం, అలాగే జూన్ 24న పుట్టిన రోజు జరుపుకోబోతున్న ఎమ్మెల్యే బేబి నాయనకు ఈ రక్తదానం కార్యక్రమం ఆయన పుట్టినరోజు కానుకగా ఇస్తున్నామని మనోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి, మాజీ ఏంసి చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, బొబ్బిలి బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పువ్వల ఈశ్వరరావు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చుక్కవలస పల్లెనిద్రలో ఎస్ఐ లక్ష్మణరావు

విశాలాంధ్ర-గరివిడి : యువతను నేడు మత్తు పదార్థాలు ఆకర్షిస్తున్నాయని, వాటిని దూరంగా ఉంచితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ బి. లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన మండలంలోని చుక్కవలసలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాత్రి గ్రామంలోని పెద్దలు, యువతతో మాట్లాడారు. ముందుగా ఆడవాళ్ళపై జరుగుతున్న అత్యాచారాలపై చర్చించారు., అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ట్రాఫిక్ రూల్ ఏవిదంగా పాటించాలో వివరించారు. అందరూ ఐక్యంగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని కోరారు. చట్ట పరంగా తన అవసరం ఎప్పుడు వచ్చినా చేస్తానని తెలిపారు. యువత మాత్రం విద్యపై దృష్టి సారించాలని, మంచి ఉద్యోగాలను సాదించి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. అనంతరం రాత్రి గ్రామంలోనే బస చేసారు.

నీట్ ఫలితాలలో శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: శనివారం విడుదలైన నీట్ పరీక్ష ఫలితాలలో పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు వీరిలో కె . నితి642 మార్కులు, ఎన్ అక్షయ 528, పి లావణ్య శ్రీ 507, ఎం సంజన 503, ఎం ఈశ్వర తేజ 463, యు సాయి శిరీష 440, పి వింధ్య హాసిని 404, మార్కులు సాధించినట్లు ఏజీఎం నర్సు నాయుడు తెలిపారు. నిరంతరం శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత ఫలితాలను సాధించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వీరికి వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. అభినందించిన వారిలో జోనల్ ప్రిన్సిపాల్ కె శ్రీధర్, ప్రిన్సిపల్ శ్రీధర్ రావు, జోనల్ ఏవో కె మధుసూదనరావు, ప్రిన్సిపల్ సురేష్ ఏవో రామచంద్రరావు తదితర కళాశాల సిబ్బంది ఉన్నారు.